754) సాళంగనాట

ప॥ సారెకు నానవెట్టకు సంగతిగాదు। మారుమాట నే నేర మర్మమింతేగాని॥

చ॥ చిత్తమెట్టున్నదో నీకు సిగ్గువడుందాన నేను। అత్తి నీవూ నాపె గూడినది చూచితి।
యిత్తల మగవాడవు యేమైనా నమరు నీకు। రుత్తనవ్వే వచ్చీ నాకు రోసమేమీ లేదు॥

చ॥ తగవెట్టున్నదో నీకు దయవుట్టీ నాకైతే। తెగువతో మీయిద్దరిదిక్కును జూచి।
అగపడ్డదొరవు నీ వన్నియు జెల్లు నీకు। మొగమోటే మించె నాకు మోసమేమీ లేదు॥

చ॥ వెఱగాటాయనో నీకు వేడుకపుట్టెను నాకు। నెఱి మీభావన మెఱిగి నే గూడితి।
వెఱపేమీ లేదు శ్రీవేంకటేశుడవు నీవు। తఱి నామతి గరగె తక్కువేమీ లేదు॥